క్లుప్తంగా

పైనంపల్లి సొసైటీ ఉపాధ్యక్షుడిగా శ్రీను

నేలకొండపల్లి: మండలంలోని పైనంపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ఉపాధ్యక్షుడిగా కలకుంట్ల శ్రీను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శనివారం సొసైటీ కార్యాలయంలో ఉపాధ్యక్షుడి పదవికి ఎన్నిక నిర్వహించారు. మొత్తం 13 మంది డైరెక్టర్లు సమావేశానికి హాజరయ్యారు. డైరెక్టర్‌గా ఉన్న కలకుంట్ల శ్రీనును ఉపాధ్యక్షుడిగా అంతా ఆమోదించారు. దీంతో ఎన్నిక ఏకగ్రీవమైనట్లు ఎన్నికల అధికారి, అసిస్టెంట్ రిజిస్ట్రార్ యం.శృతి ప్రకటించారు. అనంతరం సొసైటీ చైర్మన్, డీసీఎంఎస్ డైరెక్టర్ నాగుబండి శ్రీనివాసరావు, డైరెక్టర్లు తదితరులు నూతన ఉపాధ్యక్షుడిని ఘనంగా సన్మానించారు.

కమిటీ ఎన్నిక

నేలకొండపల్లి: టీఎస్‌యూటీఎఫ్ నూతన కమిటీని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా షేక్ నవాబ్‌సాహెబ్, ప్రధాన కార్యదర్శిగా ఏ.గోవిందరావు, ఉపాధ్యక్షులుగా విజయ్‌కుమార్, పి.మంగేశ్వరీ, కోశాధికారిగా టి.గురవయ్య, కార్యదర్శులుగా మంగపతిరావు, కవితాకుమారి, పద్మ, రామారావు, నాగార్జున, కోటేశ్వరరావు, మండల ఆడిటర్‌గా టీ.శ్రీనివాసరావు, జిల్లా ఆడిట్ సభ్యులుగా అరవింద్‌కుమార్, మండల ఎఫ్‌డబ్ల్యూఎఫ్ కన్వీనర్‌గా టి.గురవయ్య లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

కురుమసంఘం..



దేవర వెంకన్న, నగర అధ్యక్షుడు

ఖమ్మం మామిళ్లగూడెం : కురుమసంఘం ఖమ్మం నగర అధ్యక్షుడిగా దేవర వెంకన్నను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శనివారం ఖమ్మం సంఘ కార్యాలయంలో జరిగిన సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. నగర కార్యదర్శిగా ఎం .గౌరి శంకర్, కోశాధికారిగా చిందం సైదులును ఎన్నుకున్నారు. ఎన్నికల పరిశీలకులుగా దయ్యాల రాంమల్లేశం వ్యవహరించగా కొమరయ్య, మాదయ్య, నాగులు, మల్లేశం, వెంకటేశ్వర్లు, కుమార్ పాల్గొన్నారు.

మన ఆరోగ్యం మన చేతుల్లోనే...

నేలకొండపల్లి: మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉందని ప్రతీ ఒక్కరూ తెలుసుకోవాలని హైద్రాబాద్ ఇంటర్నేషనల్ స్కూల్ పదో తరగతి విద్యార్థిని మామిళ్ల యామిని అన్నారు. గచ్చిబౌలిలోని ఓక్రిడ్జ్ స్కూల్ విద్యార్థిని యామిని ఆధ్వర్యంలో హెల్త్ అవేర్‌నెస్ కార్యక్రమం నిర్వహించారు. ప్రాజెక్ట్ వర్క్‌లో భాగంగా నేలకొండపల్లి మండలంలోని ఆరెగూడెం ప్రభుత్వ పాఠశాలలో అవగాహన నిర్వహించారు. విద్యార్థులకు శానిటైజర్లు, మాస్కులు పంపిణీ చేశారు. డైరెక్టర్ మామిళ్ల హనుమంతరావు, ప్రిన్సిపాల్ బి.లక్ష్మయ్య, ఫ్యాకల్టీ కుర్రి నాగరాజు, ఉపాధ్యాయులు ఎస్.నాగార్జున, వెంకటనారాయణ, జనార్దన్ పాల్గొన్నారు.

క్యాలెండర్ల ఆవిష్కరణ

ఖమ్మం సహకారనగర్: టీఎస్‌యూటీఎఫ్ ఆధ్వర్యంలో రూపొందించిన 2024 నూతన సంవత్సరం క్యాలెండర్లను శనివారం నగరంలోని సంఘం జిల్లా కార్యాలయంలో రాష్ట్ర ఉపాధ్యక్షురాలు చావా దుర్గాభవాని ఆవిష్కరించారు. జిల్లా ప్రధాన కార్యదర్శులు జివి నాగమల్లేశ్వరరావు, పారుపల్లి నాగేశ్వరరావు, నాయకులు షమీ, వల్లంకొండ రాంబాబు, లక్ష్మీకుమారి, నర్సింహారావు, రంజాన్, శ్రీనివాసరావు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఖమ్మం మామిళ్లగూడెం: పద్మశాలి–పద్మమిత్ర నూతన సంవత్సర క్యాలెండర్‌ను కస్బాబజార్‌లో పద్మశాలి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కమర్తపు మురళి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అనంతరం కార్యదర్శి కమర్తపు మురళి, బొమ్మా రాజేశ్వరావులను ఘనంగా సత్కరించారు. జిల్లా గౌరవాధ్యక్షుడు బొమ్మా రాజేశ్వరరావు, శ్రీనివాస్‌బాబు, జనార్దన్, బండారు శ్రీనివాస్, కొండల్‌రావు, సత్యనారాయణ, సంపత్,వీరభద్రం, కమర్తపు శ్రీధర్, పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి శ్రమించాలి

కామేపల్లి: బీజేపీ పార్టీ బలోపేతానికి ప్రతీ కార్యకర్త కష్టపడాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు యాప సీతయ్య అన్నారు. శనివారం కామేపల్లిలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అన్ని వర్గాల అభివృద్ధి, సంక్షేమానికి అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తుందన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికలలో పార్టీ విజయానికి ప్రతీ కార్యకర్త పని చేయాలన్నారు. భాగం రంగారావు, భూక్యా శ్రీను, పోలూరి రామచంద్రయ్య, భాస్కర్ నాయక్, కొమ్మినేని భద్రయ్య, భూక్యా లాలునాయక్ తదితరులు పాల్గొన్నారు.

నగరంలో సినిమాలు

తిరుమల	సలార్
వినోద	హాయ్‌నాన్న
సాయిరాం	డెవిల్
ఆదిత్య	సలార్
శ్రీనివాస	సలార్

– ఖమ్మం గాంధీచౌక్

స్వీట్లు కొనుగోళ్లు..



బేకరీలో యువతులు



సిద్ధం చేసిన కేకులు



నూతన సందడి..

న్యూ ఇయర్ సందర్భంగా జోరందుకున్న విక్రయాలు

- పెద్దఎత్తున కేక్‌లు, స్వీట్ల తయారీ
- బిర్యానీలు, కూల్‌డ్రింక్స్‌కు కాంబో ఆఫర్లు
- రంగులు, అలంకరణ వస్తువులు, క్యాలెండర్లు కొనుగోళ్లు

సండే స్పెషల్

ఖమ్మంగాంధీచౌక్: న్యూ ఇయర్ సందడి ప్రారంభమైంది. న్యూ ఇయర్ అనగానే ప్రధానంగా కేక్‌లు, స్వీట్లకు ప్రత్యేకం. పాత సంవత్సరానికి గుడ్ బై చెబుతూ.. కొత్త సంవత్సరానికి ఆహ్వానం పలుకుతూ కేక్‌లు కట్ చేయడం, స్వీట్లు పంచుకోవటంతో పాటు విందులు కూడా జరుపకోవటం ఆనవాయితీ. ఈ వేడుకలను దృష్టిలో పెట్టుకుని మార్కెట్‌లో వివిధ వర్గాల వారికి అవసరమైన కేక్‌లతో పాటు, తినుబండారాలను విక్రయిస్తున్నారు. కేక్‌లు, స్వీట్లతో పాటు కూల్‌డ్రింక్స్, బిర్యానీలు, వెజ్, నాన్‌వెజ్ ఆహార పదార్థాల విక్రయాలు జోరందుకుంటున్నాయి. ముగ్గులతో నూతన సంవత్సరానికి ఆహ్వానం పలికేందుకు మహిళల సందడి కూడా మరో ప్రత్యేకంగా నెలకొంది. ఇళ్ల ఎదుట అందంగా ముగ్గులు వేసుకునేందుకు రంగులు, చమ్కీలతో కూడిన మెరిసే ముగ్గులను కూడా విక్రయిస్తున్నారు. ఇక కొందరు మహిళలు ఇళ్ల అలంకరణల వస్తువులను, తమ అలంకరణలకు అవసరమైన గాజులు వంటి వాటిని కూడా కొనుగోళ్లు చేస్తున్నారు. ఇక బుక్ స్టాల్స్‌లో నూతన సంవత్సర క్యాలెండర్లు, డైరీల విక్రయాలు కూడా చేస్తున్నారు. పలు క్యాలెండర్లలో రాశి ఫలాలు, పండుగుల వివరాలు, పంచాంగం వంటి అంశాలు ఉండటంతో వాటిపై నమ్మకం ఉన్న వారు కొనుగోలు చేస్తున్నారు. సోమవారం నుంచి 2024 నూతన సంవత్సరం ప్రారంభమవుతున్న నేపథ్యంలో 2023కు గుడ్‌బై చెబుతూ నూతన సంవత్సరానికి ఆహ్వానం పలుకుతూ జరుపుకునే వేడుకలపై సండే స్పెషల్...

కేక్‌లు, స్వీట్లు ప్రత్యేకం

కొత్త సంవత్సరం అనగానే కేక్‌లు కట్ చేసి శుభాకాంక్షలు తెలుపుకుంటారు. ఈ వేడుకలకు ప్రాధాన్యం పెరగటంతో స్వీట్ షాపుల్లో, బేకరీల్లో వివిధ రకాల కేకులు, స్వీట్లు విక్రయిస్తున్నారు కొందరు తమ అభిరుచి మేరకు ఆర్డర్లు ఇచ్చి కేకులు తయారు చేయించుకున్నారు. సెమీ ఫాండెంట్, బార్‌బీ, టాయిస్ కేక్, స్టెప్ కేక్, మిక్కీమౌస్, స్క్వేర్ ఏక్ తదితర ఆకృతిలో తయారు చేసి విక్రయాలను ప్రారంభించారు. పేరున్న బేకరీల్లో సైజు, రకాన్ని బట్టి కేజీ రూ. 450లు ఆపైన ధరలతో కేక్‌లను విక్రయిస్తుండగా, మరికొన్ని బేకరీల్లో రూ. 250ల నుంచి ఆపైన ధరలతో కేక్‌లను విక్రయిస్తున్నారు. రహదార్లు, వీధి వీధినా టెంట్లు వేసి కేక్‌లను విక్రయించేందుకు కొందరు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. డీజేలు పెట్టి కొత్త పాటలతో హంగామా చేస్తూ యువతను ఆకట్టుకొని కేక్‌లను విక్రయించేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఇక స్వీట్ దుకాణాల్లో కూడా గిరాకీ పెరిగింది. రకరకాల స్వీట్లను నూతన సంవత్సర స్పెషల్‌గా విక్రయిస్తున్నారు.

ప్రత్యేకంగా ఆఫర్లు..

బేకరీల్లో, రహదార్ల వెంట కేక్‌లకు కూల్ డ్రింక్స్‌ను ఆఫర్లుగా పెట్టారు. కేజీ కేక్ కొనుగోలు చేస్తే ఒక కూల్ డ్రింక్ బాటిల్ ఉచితంగా ఇస్తున్నారు. రూ. 280 నుంచి రూ. 300ల విలువ చేసే కేక్ కొనుగోలు చేస్తే రూ. 60 నుంచి రూ. 70ల విలువ చేసే కూల్ డ్రింక్స్‌ను ఉచితంగా ఇస్తున్నారు. యువతీ యువకులు, విద్యార్థులు ఆఫర్లకు మొగ్గు చూపుతున్నారు.



రంగుల విక్రయాలు

కొన్ని బేకరీలు, స్వీట్ల దుకాణాల్లో న్యూ ఇయర్ ఆఫర్లుగా స్వీట్లను కొంత మేరకు తక్కువ ధరలను ఆఫర్లగా పెట్టి విక్రయిస్తున్నారు. ఇక బిర్యానీలకు కూడా ఆఫర్లు ఇస్తున్నారు. ఒక్కో బిర్యానీకి మరో బిర్యానీ, ఒక బిర్యానీ ఒక లీటరు కూల్ డ్రింక్ ఇలా కాంబో ఆఫర్లు ఇస్తున్నారు.

ముగ్గులు, అలంకరణ వస్తువుల విక్రయాలు

కొత్త సంవత్సరం కొంగొత్తగా ఉండాలని ఇళ్ల ముందు అందమైన ముగ్గులు వేయటం కోసం మగువలు ఆరాటపడటాన్ని గుర్తించి మార్కెట్‌లో రంగురంగుల ముగ్గులు విక్రయిస్తున్నారు. రంగురంగుల ముగ్గులు విక్రయించటంతో పాటు వాటిలో చమ్కీలు కలిపి కూడా విక్రయిస్తున్నారు. ఇక రంగుల ముగ్గలతో పాటు కొత్త సంవత్సరంలో ఇళ్లు కొత్తగా కనిపించేందుకు వివిధ రకాల అలంకరణలు కూడా విక్రయిస్తున్నారు. కర్టెన్లు, ఫ్లవర్ వాజ్‌లు వంటివి విక్రయిస్తున్నారు. మహిళలు తమ అలంకరణలకు అవసరమైన గాజులు వంటి వస్తువులను కూడా కొనుగోళ్లు చేస్తున్నారు.

వేడుకలకు సిద్ధమవుతున్నాం..



నూతన సంవత్సర వేడుకలను ఆనందంగా జరుపుకునేందుకు సిద్ధమవుతున్నాం. ఇంటిలో కుటుంబంతో, స్నేహితులతో న్యూ ఇయర్ వేడుకలను జరుపుకునేందుకు స్వీట్లను, కేక్‌లను కొనుగోలు చేస్తున్నాం. కొత్త సంవత్సరం ఆనందం బాగుటుంది. అంతా ఉత్సాహంగా గడుపుతాం. కేకలకు ఆర్డరు ఇచ్చాం.

– శీలం కార్తీక్, నాయుడుపేట, ఖమ్మం

స్వీట్లు, కేక్‌లు ఆర్డర్ చేశాం



నూతన సంవత్సర సంబురాలను ఓ పండుగలా జరుపుకుంటాం. స్వీట్లు, కేక్‌లు ఆర్డర్ చేశాం. ఇష్టమైన బిర్యానీలను కూడా ఆర్డరు చేశాం. స్నేహితులం తప్పక న్యూయర్ సందర్భంగా కలుసుకుంటాం. పాత సంవత్సరానికి వీడ్కోలు పలుకుతూ కొత్త సంవత్సరానికి స్వాగతిస్తూ ఆనందంగా గడుపుతాం.

– పదాల శివానందరెడ్డి, పంపింగ్‌వెల్ రోడ్, ఖమ్మం

ప్రత్యేకంగా కేక్‌లు తయారీ



ప్రజల అభిరుచులకు అనుగుణంగా కేక్‌లను తయారు చేస్తున్నాం. ఇప్పటికే కేక్‌లకు ఆర్డర్లు వచ్చాయి. సైజు, రకాన్ని బట్టి ధరలు నిర్ణయించి విక్రయిస్తున్నాం. రిటైల్ వ్యాపారులు కూడా ఆర్డర్లు ఇచ్చి కొనుగోలు చేసి తీసుకువెళుతున్నారు. రిటైల్‌గా కిలో రూ. 200లు ఆపైన, అరకిలో అయితే రూ. 120ల చొప్పున విక్రయిస్తున్నాం.

– ఎస్‌డీ జాఫర్ అలీ, హైదరాబాద్ బేకరీ అండ్ స్వీట్స్

స్వీట్లకు డిమాండ్ పెరిగింది



నూతన సంతవ్సరం వేడుకల సందర్భంగా స్వీట్లకు డిమాండ్ పెరిగింది. ఈ మేరకు ప్రత్యేకంగా స్వీట్లను తయారు చేయిస్తున్నాం. గ్రూపుగా వేడుకలు జరుపుకునే మిత్రులు ప్రత్యేకంగా స్వీట్లకు ఆర్డర్లు ఇస్తున్నారు. ఇళ్లలో కుటుంబాలుగా వేడుకలు జరుపుకునే వారు కూడా స్వీట్లు కొనుగోలు చేస్తున్నారు.

– శ్రీరంగం పద్మావతి, తిరుమల స్వీట్స్ అండ్ బేకరీ, పీఎస్ఆర్ రోడ్, ఖమ్మం

రోడ్డు, డ్రైయినేజీ దుస్థితిపై మంత్రి తుమ్మల ఆరా

సాక్షి ఎఫెక్ట్..

ఖమ్మంగాంధీచౌక్: నగరంలోని త్రీటౌన్ కాల్వొడ్డు–త్రీటౌన్ పోలీస్ స్టేషన్ వరకు ఉన్న రహదారి దుస్థితి, ఈ మార్గంలో శ్రీ సత్యనారాయణ సహిత ఆంజనేయ స్వామి ఆలయం వద్ద డ్రెయినేజీతో ప్రజలు పడుతున్న ఇబ్బందిపై 'అభివృద్ధికి ఆమడదూరం' పేరిట శనివారం 'సాక్షి'లో ప్రత్యేక కథనం ప్రచురితమైంది. ఈ కథనానికి రాష్ట్ర వ్యవసాయ, సహకార మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పందించారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఇదే ప్రాంతంలో జరిగిన ఓ ప్రైవేటు కార్యక్రమంలో పాల్గొనగా ఈ సందర్భంలో ఆ కథనంపై ఈ ప్రాంతానికి చెందిన పలువురితో చర్చించారు. సంబంధిత శాఖ అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరించే విధంగా కృషి చేయాలని సమాచారం. ఇదే విషయం కార్పొరేషన్ అధికారులకు వరకు కూడా చేరినట్లు తెలిసింది. మంత్రి దృష్టికి సమస్య చేరటంతో సమస్యలు పరిష్కారమవుతాయని ఈ ప్రాంత వాసులు భావిస్తున్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ



చెక్కు పంపిణీ చేస్తున్న డిప్యూటీ మేయర్

ఖమ్మంవన్‌టౌన్: ఖమ్మం కార్పొరేషన్‌లోని వివిధ డివిజన్‌లకు చెందిన 60 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మీ చెక్కులను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశాల మేరకు ఆయన క్యాంపు కార్యాలయంలో డిప్యూటీ మేయర్ ఫాతిమా జోహర, కార్పొరేటర్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీలను వంద రోజుల్లో అమలు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు కమర్తపు మురళీ, దుద్దుకూరి వెంకటేశ్వర్లు, లకావత్ సైదులు, రావూరి కరుణ, మిక్కిలినేని మంజుల, రఫీదాబేగం , గజ్జెల లక్ష్మీ, పాకాలపాటి విజయనిర్మల, నాయకులు ఎండీ ముస్తఫా, చావా నారాయణరావు, రావూరి సైదుబాబు, వడ్డెబోయిన నర్సింహారావు, గుడిపూడి జగదీష్, దొడ్డా అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపాలనను సద్వినియోగం చేసుకోవాలి



తిరుమలాయపాలెం: దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు



ఖమ్మంఅర్బన్/రఘునాథపాలెం: కోటపాడులో..



ఖమ్మంరూరల్: తెల్దార్‌పల్లి గ్రామసభలో మాట్లాడుతున్న తహసీల్దార్ రామకృష్ణ



కామేపల్లిలో..

తిరుమలాయపాలెం: ప్రజాపాలన కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మండల ప్రత్యేకాధికారి జేడీఏ విజయనిర్మల అన్నారు. మండలంలోని కొక్కిరేణిలో ప్రజా పాలన కార్యక్రమాన్ని పరిశీలించారు. అదేవిధంగా మండలంలోని ఎర్రగడ్డ, జల్లెపల్లి, హైదర్‌సాయిపేట, సోలీపురం, కాకరవాయి, గ్రామాల్లో సభలు నిర్వహించారు. తహసీల్దార్ రామ్‌ప్రసాద్, ఎంపీడీఓ శ్రీనివాసరావు, ఎంపీఓ రాజేశ్వరి, జెడ్పీటీసీ బెల్లం శ్రీనివాస్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ఖమ్మంరూరల్: మండలంలోని మద్దులపల్లి, తెల్దార్‌పల్లి, ఆరేకోడు, తీర్థాల ప్రజాపాలన గ్రామసభలు జరిగాయి. తహసీల్దార్ రామకృష్ణ ప్రజల నుండి వచ్చే దరఖాస్తులను స్వీకరించారు.

ఖమ్మంఅర్బన్, రఘునాథపాలెం: ప్రజా పాలన కార్యక్రమంలో భాగంగా రఘునాథపాలెం మండలంలో ఆరు గ్రామ పంచాయతీల్లో, నగరంలోని 14, 15 డివిజన్లలో సభలు నిర్వహించారు. తహసీల్దార్ లూథర్ విల్సన్, ఎంపీడీఓ రామకృష్ణ, ఎంపీఓ శ్రీనివాసరెడ్డి, ఎంఈఓ శ్రీనివాస్ పాల్గొన్నారు.

కామేపల్లి: మండలంలోని బర్లగూడెం, మద్దులపల్లి, జగన్నాథతండా గ్రామాల్లో జరిగిన ప్రజాపాలన కార్యక్రమం నిర్వహించారు. మండల ప్రత్యేకాధికారి రవిబాబు, తహసీల్దార్ సుధాకర్, ఎంపీడీఓ విజయభాస్కరరెడ్డి,ఏఈ శ్రీనివాసులు, ఏఓ తారాదేవి,ఎంపీటీసీ గుగులోత్ గబ్రూనాయక్, నాయకులు మాలోత్ సరిరాంనాయక్, గోపీరెడ్డి,గట్టికొప్పుల నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేలకొండపల్లి: మండలంలోని రాజేశ్వరపురం, శంకరగిరితండా, పైనంపల్లి గ్రామాలలో స్పెషల్ ఆఫీసర్ కొండపల్లి శ్రీరామ్ పర్యవేక్షించారు. ఎంపీడీఓ కె.జమలారెడ్డి, తహసీల్దార్ అనురాధాబాయి, పంచాయతీ అధికారి శివ పాల్గొన్నారు.

కూసుమంచి: మండలంలో మల్లేపల్లి, కిష్టాపురం, పోచారం, నర్సింహులగూడెం, గోరీలపాడుతండా, హీరామన్‌తండాల్లో దరఖాస్తు చేసుకున్నారు. తహసీల్దారు సంపత్‌కుమార్, ఎంపీడీఓ రమాదేవి, ఎంపీఓ రాంచందర్ పర్యవేక్షణలో ఈసభలను నిర్వహించారు. గోరీలపాడుతండాలో ఎంపీపీ బాణోత్ శ్రీనివాస్ పాల్గొన్నారు



కూసుమంచి: కిష్టాపురంలో..



నేలకొండపల్లి: పైనంపల్లిలో..

న్యూ ఇయర్ వేడుకలు

ఖమ్మం నగరంలోని పలు ప్రైవేట్ పాఠశాలలో నూతన సంవత్సర వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. – ఖమ్మం సహకారనగర్



త్రివేణి పాఠశాలలో..



రెజొనెన్స్ శ్రీనివాసనగర్‌లో..



రెజొనెన్స్ శ్రీనగర్‌లో..

ఘనంగా ఫ్రెషర్స్ డే



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న గుండాల కృష్ణ

ఖమ్మం సహకారనగర్: నగరంలోని ఎస్‌బీఐటీ కళాశాలలో ఈసీఈ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ఫ్రెషర్స్‌డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ గుండాల జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఇటీవల విద్యార్థులకు నిర్వహించిన పలు క్రీడా పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులు అందించారు. సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ జి. ధాత్రి, అకాడమిక్ డైరెక్టర్లు గంధం శ్రీనివాసరావు, ఏఈవీ శివ ప్రసాద్, ప్రవీణ్ కుమార్, రవీంద్రబాబు, శ్రీనివాసరావు, గంగాధర్, ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్, వైస్ ప్రిన్సిపల్ అమిత్ బింధాజ్ పాల్గొన్నారు.

బెల్ట్ షాపులను ఎత్తివేయాలి

ఖమ్మంమయూరిసెంటర్: రాష్ట్రంలో బెల్ట్ షాపులను ఎత్తివేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని పీవైఎల్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జాటోత్ ప్రేమ్‌సింగ్, ఎస్.వి రాకేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక రామనరసయ్య విజ్ఞాన కేంద్రంలో జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. సంఘ జిల్లా ఉపాధ్యక్షులు కుసు మోహన్‌రెడ్డి, మంద సురేష్, నాయకులు చందు, సిహెచ్ ధరన్, మాలోత్ బాలు, గోకినేపల్లి నరేష్, దుంప కామేష్ పాల్గొన్నారు.

ట్రాఫిక్‌పై అవగాహన

ఖమ్మంరూరల్: మండలంలోని పల్లెగూడెంలో యూత్ ఆధ్వర్యంలో శనివారం ట్రాఫిక్ నిబంధనలపై ట్రాఫిక్ పోలీసులతో కలిసి యువకులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎస్సైలు రవికుమార్, షకీర్, న్యాయవాది పంబా నాగేశ్వరరావు, సిబ్బంది తోటమల్ల. అజయ్, కె. నరేందర్, సిహెచ్.కృష్ణయ్య, మురళి, ఎం. లాలుబాబు, పి. కిరణ్, జి. అఖిల్, కె.గణేష్, ఉపేందర్, యువకులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయురాలికి కాంస్య పతకం

ఖమ్మంఅర్బన్: ఖమ్మం నగరం వెలుగుమట్ల ఉన్నత పాఠశాల ఉపాధ్యాయురాలు ఎస్.ఉదయలక్ష్మి కాంస్య పతకాన్ని సాధించారు. 42వ జాతీయ యోగాసన చాంపియన్ షిప్‌లో పోటీలు పశ్చిమబెంగాల్ రాష్ట్రం దుర్గాపూర్లో జరిగిన ఈ పోటీల్లో రాష్ట్రం తరఫున ఆమె ప్రాతినిధ్యం వహించారు. 50–60 ఏళ్ల వయస్సు వారి గ్రూపులో పోటీ పడి తృతీయ స్థానంలో నిలిచి కాంస్యపతకాన్ని అందుకున్నారు.

జీవితాంతం మీకు రుణపడి ఉంటా..

- జర్నలిస్టుల ఆత్మీయ సమావేశంలో మంత్రి తుమ్మల

ఖమ్మంవన్‌టౌన్: ఎమ్మెల్యేగా తన గెలుపులో కీలక పాత్ర పోషించిన జర్నలిస్టులకు జీవితాంతం రుణపడి ఉంటానని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఖమ్మంలో శనివారం జరిగిన జర్నలిస్టుల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. తన 40ఏళ్ల రాజకీయ జీవితంలో తెలిసి ఎవరికీ హానీ చేయలేదని, ఎప్పుడూ తప్పు చేయలేదని పేర్కొన్నారు. గతంలో జిల్లా నలుమూలలా తాను చేసిన అభివృద్ధిని చూసి ఖమ్మంలో గెలిపించారని, వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా మరో ఇద్దరు మంత్రుల సహకారం, శ్రీరామచంద్రుడి ఆశీస్సులతో సర్వతోముఖాభివృద్ధికి పాటుపడతానని తెలిపారు. కాగా, జర్నలిస్టులు బాధ్యతాయుతమైన పాత్ర పోషిస్తూ వాస్తవాలను ప్రచురించాలని, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో చర్చించి జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్యను పరిష్కరిస్తానని మంత్రి తుమ్మల హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నగర అధ్యక్షుడు మహ్మద్ జావీద్, నాయకులు సాధు రమేష్‌రెడ్డి, కమర్తపు మురళి, మిక్కిలినేని నరేందర్, చావా నారాయణరావు, చోటేబాబా, తుపాకుల యలగొండలస్వామి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

అక్షింతల ఊరేగింపు..

ఖమ్మంగాంధీచౌక్: అయోధ్య రామ మందిరం నుంచి వచ్చిన అక్షింతల ఊరేగింపు శనివారం ఖమ్మం నగరంలో ఘనంగా జరిగింది. ఖమ్మం అసెంబ్లీ నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ'ఏ' బ్లాక్ అధ్యక్షుడు యర్రం బాలగంగాధర్ తిలక్ అక్షింతలను తలపై మోశారు. నిర్వాహకులు మిట్టపల్లి శ్రీనివాస్, సంధ్యారాణి, కోయల వీరభద్రం, వాసవి, గుండపనేని ఉదయ్‌కుమార్, ఉమారాణి, పెనుగొండ ఉమాశంకర్, రాధికా రాణి, అర్చకులు ముదుంబై పవన్‌కుమార్, బాలమ్మ, భక్తమండలి సభ్యులు పాల్గొన్నారు.

సంకటహర చతుర్థి పూజలు

ఖమ్మంఅర్బన్: నగరంలోని 10వ డివిజన్ ఇందిరానగర్ సెంటర్‌లోని బాలగణతి ఆలయంలో శనివారం సంకట హర చతుర్థి అభిషేకం పూజలు వందలాది మందిభక్తుల సమక్షంలో ఘనంగా నిర్వహించారు. ప్రధానార్చకులు గిరిధర్ ఆధ్వర్యంలో పూజలు చేశారు. దేవాలయ అధ్యక్ష కార్యదర్శులు బాజిన్ని వీరయ్య,తిరుపతిరావులు భక్తులకు పూజలు చేసేందుకు ఏర్పాటు చేశారు.

ఇరుముడి...

కామేపల్లి: మద్దులపల్లి గ్రామంలోని పెద్దమ్మ తల్లి దేవాలయంలో అయ్యప్ప మాలధారుల ఇరుముడి కార్యక్రమం వైభవంగా జరిగింది. గురుస్వాముల ఆధ్వర్యంలో కట్టుకుని శబరిమలై బయలుదేరి వెళ్లారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

ఎస్‌ఎఫ్‌ఐ ఆవిర్భావ వేడుకలు

ఖమ్మంమయూరిసెంటర్: ఎస్‌ఎఫ్‌ఐ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఖమ్మంలో శనివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ఎస్‌ఆర్‌అండ్‌బీజీఎన్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద సంఘ పతాకాన్ని మాజీ జిల్లా కార్యదర్శి ఎం.సుబ్బారావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంఘ రాష్ట్ర కార్యదర్శి టి.నాగరాజు మాట్లాడుతూ.. భారతదేశ విద్యార్థి ఉద్యమంలో అనేక ఉద్యమాలు నడిపిన వేగుచుక్క ఎస్‌ఎఫ్‌ఐ అని అన్నారు. నూతన విద్యావిధానాన్ని వ్యతిరేకించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ పూర్వ జిల్లా కార్యదర్శి చింతల రమేష్, జిల్లా కార్యదర్శి టి.ప్రవీణ్, నాయకులు ఫర్వీన్, రాజు, ప్రేమ్‌కుమార్, వీరేందర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టి.నాగరాజు

నిబంధనలు అతిక్రమించొద్దు

కూసుమంచి: నూతన సంవత్సర వేడుకల సందర్భంగా ఎవరూ నిబంధనలను అతిక్రమించొద్దని, ఈవేడుకలు ఇతరులకు ఇబ్బందిని కలుగనీయ వద్దని కూసుమంచి సీఐ కంది జితేందర్‌రెడ్డి కోరారు. యువకులు రోడ్లపై ద్విచక్ర వాహనాలతో చక్కర్లు కొట్టడం, ర్యాలీలు నిర్వహించటం నిషేదమన్నారు. మద్యం దుకాణాలను, దాబాలు, హోటళ్లను నిర్ణీత సమయానికే మూసి వేయాలని సూచించారు. నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని సీఐ హెచ్చరించారు.

బచ్చోడుని మండలం చేయాలని వినతి

తిరుమలాయపాలెం: బచ్చోడుని మండల కేంద్రంగా ఏర్పాటు చెయ్యాలని కోరుతూ శనివారం బచ్చోడు గ్రామానికి చెందిన న్యాయవాది తిమ్మిడి మురళీకృష్ణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు వినతి పత్రం అందజేశారు. గతంలో ప్రజా చైతన్య యాత్రలో భాగంగా బచ్చోడు గ్రామానికి వచ్చిన సందర్భంగా ఇచ్చిన హామీని డిప్యూటీ సీఎంకి గుర్తు చేశామన్నారు. స్పందించిన భట్టి బచ్చోడును కచ్చితంగా మండలకేంద్రం చేస్తామని హామీ ఇచ్చారని మురళీకృష్ణ తెలియజేశారు.